అమ్మ సంబరం.. ఊరూరా ఉత్సాహం

బంగారమ్మ శరణు..శరణు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి అనుబంధంగా పిచ్చాటూరు రోడ్డులో వెలసి ఉన్న ప్రసిద్ధ శ్రీబంగారమ్మ ఆలయ జాతర బుధవారం ఘనంగా జరిగింది. ముందుగా ఆలయంలో అమ్మవారికి పెరుగు, చందనం, పాలు, నారికేళ జలాలు, కలశ జలాలతో అభిషేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి ముగ్గు వేశారు. సాయంత్రం 4గంటలకు కుంభం వేశారు. 6గంటలకు బంగారమ్మ అమ్మవారి ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం నిమజ్జన కార్యక్రమం కోలాహలంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా అంతకు ముందు శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ఈవో ఎస్వీ నాగేశ్వరరావు దంపతులు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి సారె అందజేశారు. ఆలయ అధికారులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

వైభవంగా పొన్నెయమ్మ జాతర

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలో శ్రీపొన్నెయమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. పళ్లికొండేశ్వరస్వామి దేవస్థానం తరపున కార్యనిర్వాహణాధికారి కె.రామచంద్ర రెడ్డి, అర్చకులు, సిబ్బందితో కలిసి అమ్మవారికి మంగళ వాయిద్యాల నడుమ పట్టు వస్త్రాలతో కూడిన సారె సమర్పించారు. ఏటా జాతరకు శ్రీపల్లికొండేశ్వరస్వామి ఆలయం నుంచి సారె సమర్పించడం ఆనవాయితీ. అర్చకులు, గ్రామపెద్దలు సంప్రదాయబద్ధంగా సారె స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించారు.




శ్రీకాళహస్తి: ప్రత్యేకాలంకరణలో బంగారమ్మ అమ్మవారు, బంగారమ్మ ఉత్సవమూర్తి ఊరేగింపు



శ్రీకాళహస్తి: సారె తీసుకెళుతున్న ఎమ్మెల్యే సతీమణి రిషితారెడ్డి, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు



నాగలాపురం : సారె ఊరేగింపులో సురుటపల్లె ఆలయ ఈఓ, సిబ్బంది



సత్యవేడు :అమ్మవారి ఊరేగింపు

నరసరాజు అగ్రహారంలో..

సత్యవేడు: మండలంలోని నరసరాజు అగ్రహారంలో గంగమ్మ జాతర వేడుకగా జరిగింది. మంగళవారం రాత్రి 10గంటలకు ప్రారంభమైన ఊరేగింపు బుధవారం ఉదయం తొమ్మిది గంటల వరకు సాగింది. మహిషాసురమర్ధిని అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. తప్పెట్లు, మేళాలు, బాణాసంచా పేలుళ్ల సందడి నడుమ యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం నడివీధిలో అమ్మవారిని కొలువుదీర్చారు. భక్తులు అమ్మవారికి ఇంటింటి నుంచి సారె తీసుకువచ్చి సమర్పించారు. గంగమ్మ వెంట గండు దీపం పట్టుకుని భక్తులు నడిచారు. ఇంటింటా కుంభం వేసి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



సత్యవేడు : సారె సమర్పిస్తున్న భక్తులు

క్లుప్తంగా

కల్యాణం..కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాకాడు : మండలంలోని దుగ్గరాజపట్నం గ్రామంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ 9వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా చేపట్టారు. ముందుగా అర్చకులు అభిషేకాలు, అర్చనలు, వివిధ రకాల పూజలు, హోమాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం వేకువజామున స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు.

ఈఏపీ సెట్‌లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థి

నాయుడుపేట టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈఏపీ సెట్ ఫలితాల్లో నాయుడుపేట శ్రీవేమ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ పెమ్మారెడ్డి శ్రీనివాసులు రెడ్డి బుధవారం తెలిపారు. ఎన్.స్నేహలత 982వ ర్యాంకు, కె.పవన్ 7,032, కృష్ణ చేతన్ 7,232, ఆదిత్య 7,933, శ్రీసాయిజ్యోతి 8,011, డి.మేఘన 9,808, సి.సోమశేఖర్ 10,622 ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. కళాశాలలో మొత్తం 180 మంది పరీక్షలు రాయగా వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఆయన నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అధ్యాపకులు శ్రావన్, కృష్ణ, హరినాథ్ పాల్గొన్నారు.

నీడనిస్తున్న చెట్లు



రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లు

చిల్లకూరు : మండలంలోని కోట రోడ్డులోని కడివేడు సమీపంలో రాజ్యలక్ష్మి కాలనీ, గుత్తావారిపాళెం, చింతవరం నుంచి ఏరూరుకు వెళ్లే రోడ్డులో ఇరువైపులా ఉన్న చెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో అటుగా వెళ్లే ద్విచక్రవాహనదారులు, పశువుల కాపరులు ఆ చెట్ల నీడన సేదతీరుతున్నారు.

15 నుంచి రైతు కూలీ సంఘం మహా సభలు



కరపత్రాల ఆవిష్కరణ

వెంకటగిరి రూరల్ : రైతాంగ సమస్యల పరిష్కార దిశగా ఏలూరులో 15, 16, 17వ తేదీల్లో రైతు కూలీ సంఘం మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీవీ రమణయ్య తెలిపారు. ఆయన బుధవారం పల్లెవీధిలోని శ్రీకాళహస్తి శేషయ్య భవనం వద్ద పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహా సభలకు రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం కార్యవర్గ సభ్యుడు గంగలపూడి కృష్ణారెడ్డి, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా హైవే బ్రిడ్జి



లింగసముద్రం బ్రిడ్జి వద్ద విరిగిపోయిన కంచె రాడ్లు

దక్కిలి: మండలంలోని లింగసముద్రం వద్ద అలపలేరు వద్ద రాపూరు–వెంకటగిరి జాతీయ రహదారిలో నిర్మించిన బ్రిడ్జికి ఒక వైపు ఏర్పాటు చేసిన రక్షణ ఇనపరాడ్ విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణించే వాహన చోదకులు అదుపుతప్పితే వాహనాలతో పాటు వాగులో పడే ప్రమాదం ఉందని వాహనదారులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఇనుప రాడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

గోవిందుని పుష్పయాగం రేపు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో శుక్రవారం పుష్పయాగ మహోత్సవం వేడుకగా నిర్వహించనున్నారు. ఈమేరకు స్వామివారి పుష్పయాగానికి గురువారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 నుంచి 4 గంటల వరకు స్వామివారికి పుష్పయాగం మహోత్సవం జరుగనుంది.

నేత్రపర్వంగా ద్రౌపదీ కల్యాణం



కల్యాణోత్సవం చేస్తున్న ఆలయ పూజారి

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. పూజారి రవి ఆధ్వర్యంలో శ్రీస్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కల్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. వివిధ హోమాలు నిర్వహించి శాస్త్రోక్తంగా కల్యోణోత్సవం జరిపించారు. బుధవారం స్వామి అమ్మవార్ల ఊరేగింపు జరిగింది. సాయంత్రం భాగవతారిణి రెడ్డెమ్మ ద్రౌపదీ వస్త్రాపహరణం హరికథా గానం చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. సర్పంచ్ మంజుల, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మునిరంగారెడ్డి, ఆలయ చైర్మెన్ మాధవరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మునిరత్నం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

నాయుడుపేట టౌన్ : ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ నాయకులు మహేష్, ముకుంద బుధవారం తెలిపారు. మీరు చేసే రక్తదానం మరొకరికి ప్రాణదానం చేసినట్టేనని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు.

భక్తిప్రపత్తులతో మహాకుంభాభిషేకం




విశేషాలంకరణలో విఘ్నేశ్వరస్వామి, పూజల్లో పాల్గొన్న అశేష భక్త జనం

పిచ్చాటూరు: మండలంలోని రజానగరంలో నూతనంగా నిర్మించిన శ్రీవిఘ్నేశ్వరాలయ మహా కుంభాభిషేకం బుధవారం భక్తిప్రపత్తులతో జరిగింది. వేకువజామున 3.30 గంటలకు సంకల్పబింబ శుద్ధి, రక్షాబంధనం, హోమ పూజలు, మహాపూర్ణాహుతి, గోపూజ, గజపూజ, అష్టపూజ నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు కలశ ఊరేగింపు అనంతరం విమాన గోపుర కలశ కుంభాభిషేకం, మూలవిగ్రహం కుంభాభిషేకం, దీపారాధన, మహాప్రసాద వినియోగం, 9 గంటలకు గర్భాలయంలో స్వామివారికి మహా అభిషేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నధాన కార్యక్రమం చేపట్టారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి సేవలో తరించారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



బందారుపల్లెలో ర్యాలీ

ఏర్పేడు: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలన అందరి బాధ్యతని ప్రగతి సంస్థ మండల కన్వీనర్లు శిరీష, సుభాస్‌చంద్రబోస్ అన్నారు. బుధవారం మండలంలోని బందారుపల్లె, పాయిల్‌సెంటర్ ఎస్టీ కాలనీల్లో ప్రపంచ బాలల హక్కుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ, సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుకబట్టీలు, దుకాణాలు, అగ్రకుల వర్గాల ఇళ్లలో చిన్నారులు బాలకార్మికులుగా పనులు చేస్తున్నట్లు ఆరోపించారు. ఎక్కువగా ఎస్టీ కాలనీల్లో పిల్లలు చదువుకు దూరంగా ఉంటున్నారని చెప్పారు. చదువుతోనే ప్రగతి సాధ్యమని తల్లిదండ్రులు గుర్తించాలని తెలిపారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్చాలని సూచించారు. 18 ఏళ్లలోపు పిల్లలతో పనులు చేయించడం నేరమని తెలిపారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ ప్రతినిధులు వెంకటేష్, సురేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


పిల్లలను బడికి పంపుదాం

రేణిగుంట: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించి బడి ఈడు పిల్లలను బడికి పంపుదామని ప్రగతి సంస్థ మండల కోఆర్డినేటర్ జయలక్ష్మి అన్నారు. మండలంలోని వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీలో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బెంగుళూరు క్రై సంస్థ సహకారంతో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మహిళలు, చిన్నారులతో కలసి ప్లకార్డులను ప్రదర్శిస్తూ చైతన్యర్యాలీ నిర్వహించారు. కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రగతి సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్ గంగమ్మ, ఆశా వర్కర్ మునికుమారి పాల్గొన్నారు.

తొట్టంబేడు : బాలకార్మిక రహిత సమాజమే లక్ష్యమని ప్రగతి స్వచ్ఛంద సంస్థ శ్రీకాళహస్తి మండల కోఆర్డినేటర్ ప్రభాకర్ అన్నారు. బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం శ్రీకాళహస్తి మండలం ఎల్లంపల్లి ఎస్టీకాలనీలో సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులను ప్రదానం చేశారు.

తపాలా బీమా.. కుటుంబానికి ధీమా





గ్రామీణ ఖాతాదారుల సంక్షేమం కోసం తపాలా శాఖ సరికొత్త బీమా పాలసీని తీసుకొచ్చింది. ఏడాదికి రూ.399 ప్రీమియం చెల్లిస్తే రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తింపజేస్తోంది. ప్రీమియం చెల్లించిన రాత్రి 12 గంటల నుంచి ఏడాదిలోపు ప్రమాదంలో మరణించినా.. శాశ్వత, పాక్షిక అంగ వైకల్యం కలిగినా, పక్షవాతం సంభవించినా బీమా అందజేస్తుంది. అలాగే అర్హులైన వారికి ఆసుపత్రిలో వైద్య ఖర్చులకు సైతం ఆసరాగా నిలుస్తోంది. అలాగే ఏడాదికి రూ.699 చెల్లిస్తే రూ.10 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది. గత రెండేళ్లుగా రూ.399కే రూ.10 లక్షలు బీమా వర్తించేలా ఉండగా.. ప్రస్తుతం అందులో కొన్ని మార్పులు చేశారు. ఇందుకు 18 నుంచి 65 ఏళ్లలోపు ఉన్న ఖాతాదారులు మాత్రమే అర్హులు. – నారాయణవనం

- రూ.399తో రూ.5 లక్షల వరకు ప్రయోజనం
- రూ.699 చెల్లిస్తే రూ.10 లక్షలు
- ఖాతాదారులకు మాత్రమే అవకాశం
- పాలసీ పొందిన రోజు రాత్రి 12 నుంచే వర్తింపు
- 18–65 ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులు
- గ్రామీణులకు అందుబాటులో సేవలు

తపాలా శాఖ టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ సంస్థ, బజాజ్ అలియాంజ్, నివా బూపా వారి సౌజన్యంతో పేద, బడుగు, బలహీన వర్గాలకు అందుబాటులో ఉండేలా గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీని రూ.399, రూ.699 ప్రీమియంలతోనే అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ పాలసీలో ఎలాంటి ప్రమాదం సంభవించినా బీమా తీసుకున్నప్పటి నుంచి ఏడాది పాటు రూ.399 పాలసీ అయితే రూ.5 లక్షల బీమా కవరేజ్ వర్తిస్తుంది. రూ.699 పాలసీ అయితే రూ.10 లక్షల వరకు ప్రయోజనం ఉంటుంది. యాక్సిడెంటల్ బీమా పాలసీ 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారికి మాత్రమే వర్తిస్తుంది. ఈ పాలసీని గత రెండేళ్ల క్రితం ప్రవేశపెట్టింది. ఇప్పటికే తిరుపతిలో జిల్లాలో మాత్రమే సుమారు 5 వేల మంది వరకు పాలసీని తీసుకున్నారు.

బీమా పొందడం ఇలా..

ఈ పాలసీ పొందాలంటే ముందుగా పోస్టల్ బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలి. ఖాతా లేని వారు రూ.200తో నూతనంగా ఖాతా తెరవాలి. బీమా పాలసీలను రూ.399, రూ.699 నగదు చెల్లించి పొందవచ్చు. ప్రమాదం సంభవించినప్పుడు మాత్రమే ఈ బీమా వర్తిస్తుంది. దీర్ఘకాలిక పక్షవాతం ఉన్న వారికి బీమా వర్తించదు. బీమా చేసుకున్న తర్వాత ప్రమాదం సంభవించినా.. పక్షవాతం వచ్చినా బీమా వర్తిస్తుంది. పాలసీ కోసం నగదు చెల్లించిన రోజు అర్ధరాత్రి 12 గంటల నుంచే బీమా రక్షణ ప్రారంభమవుతుంది. పాలసీదారులకు బాండును వెంటనే అందిస్తారు.

ఇవీ ప్రయోజనాలు

- ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.399 పాలసీదారులకు రూ.5 లక్షలు బీమా వర్తిస్తుంది.
- రూ.699 పాలసీదారులకు రూ.10 లక్షల వరకు ప్రయోజనం ఉంటుంది.
- శాశ్వత వైకల్యం కలిగితే వారికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.5 నుంచి రూ.10 లక్షలు వర్తిస్తుంది.
- పక్షవాతం సంభవిస్తే రూ.10 లక్షలు
- విద్యా ప్రయోజనం పదిశాతం (గరిష్టంగా అర్హత ఉన్న ఇద్దరి పిల్లలకు) రూ.50 వేలు వర్తిస్తుంది.
- ఆసుపత్రిలో పదిరోజుల వరకు ఉంటే రోజుకు రూ.1000 చొప్పున అందిస్తారు.
- కుటుంబ రవాణా ప్రయోజనాలు రూ.10 వేలు, అంత్యక్రియలకు రూ.5 వేలు.
- యాక్సిడెంట్ మెడికల్ ఖర్చులు ఇన్‌పేషెంట్లకు రూ.60 వేల వరకు అందిస్తుంది.
- కోమా సంరక్షణ కింద రూ.50 వేలు అందిస్తుంది.
- ప్రమాదం జరిగినప్పుడు ఆసుపత్రిలో చేరితే రూ.50,000 చెల్లిస్తుంది.
- అలాగే డాక్టర్ కన్సల్టేషన్ ఉచితంగా పొందే అవకాశం.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రమాద బీమా పాలసీ ప్రతి ఒక్కరికీ అవసరమే. కష్టమర్ల కోసం ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్, టాటా ఏఐజీ, ఆదిత్య బిర్లా క్యాపిటల్, బోప నోవ కంపనీల ద్వారా తపాల శాఖ ప్రమాద బీమాను గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీ పేరుతో కొత్త పథకాన్ని అందుబాటు లోకి తెచ్చింది. తక్కువ ప్రీమియంతో అత్యధిక ప్రయోజనాలున్నాయి. ఈ పాలసీ తీసుకోవాలని భావించే వారు దగ్గరిలోని ఫోస్టాఫీసుకు వెళ్లి వివరాలు తెలుసుకోవచ్చు. మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– నరసింహ ప్రసాద్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్,పుత్తూరు

తొలకరి రాకతో సాగుకు సన్నద్ధం



మంగళంపాడులో పొలాలకు ఎరువు తోలుతున్న రైతులు

సూళ్లూరుపేట : వారం రోజుల నుంచి అప్పుడప్పుడు వానలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. సూళ్లూరుపేట ప్రాంతంలో తగిన సాగునీటి వసతి లేకపోవడం, ఎక్కువగా మెట్ట ప్రాంతాలు ఉండడంతో ఒక పంటకే పరిమితమవుతున్నారు. దీంతో నాలుగు నెలలు సేద్యంతో బిజీగా వుండే రైతులు మిగిలిన 8 నెలలు ఖాళీగానే ఉంటారు. జూన్ ప్రారంభం కావడం, నైరుతీ రుతుపవనాల ప్రభావంతో వారం రోజుల నుంచి అడపాదడపా వర్షం పడుతోంది. దీంతో రైతులు పొలాల్లో పేడ ఎరువులు తోలుకోవడం, దుక్కులు దున్నడం తదితర పనులు చేస్తున్నారు. ముఖ్యంగా వినాయక చవితి పండుగలోపు ఎల్లిపైర్లు వేసుకోవడం, వినాయక చవితి నాటికి వినాయకుడి అంత ఎత్తు పైరు వుండాలనేది పెద్దలమాట. మండలంలో సుమారు రెండు వేల హెక్టార్లలో ఎల్లిపైరు వేస్తారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు ముమ్మరంగా దుక్కులు దున్నుతున్నారు. మండలంలోని కొరిడి, దామరాయ, కడపత్ర, దామానెల్లూరు, మంగళంపాడు, ఇలుపూరు, వెలగలపొన్నూరు, మతకామూడి గ్రామాల్లో ఎక్కువగా ఎల్లిపైర్లు వేసుకోవడానికి సిద్ధం చేసుకుంటున్నారు. అదే విధంగా వరినాట్లు వేసుకునే రైతులు కూడా దుక్కులు దున్నే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పుడు ఎల్లి దుక్కులు చేసి పెట్టుకుంటే భవిష్యత్తులో పొలంలో కలుపు లేకుండా వుంటుందని రైతులు చెబుతున్నారు. బోర్లు, బావులు కింద నీటి సౌకర్యం వున్న వారు నారుమళ్లు పోసుకుంటున్నారు. వారం రోజులుగా ఆగి ఆగి కురుస్తున్న వర్షాలకు ఎల్లిపైర్లు వేసుకునే వారు మాత్రం వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు.



సూళ్లూరుపేట : దుక్కి దున్నుతున్న రైతు